క్లుప్తంగా

నేడు సీనియర్ సిటిజన్స్ సమావేశం

నల్లకుంట: నల్లకుంట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఈరోజు ఉదయం 10.30 గంటలకు పద్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య, వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ పత్రిక ఎడిటర్ భూమారెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సంస్థాగత విషయాలపై చర్చ జరుగుతుందన్నారు. నల్లకుంట, విద్యానగర్, రాంనగర్, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట, అచ్చయ్యనగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల సీనియర్ సిటిజన్స్ సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

'కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు'

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను కాలరాస్తున్నాయని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సంజీవరెడ్డిని ఐఎన్‌టీయూసీ 33వ ప్లీనరీ సమావేశంలో అంజిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం అమ్మి కార్మికుల జీవితాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. సత్యజిత్‌రెడ్డి, నర్సింహారావు, భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ముషీరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికులను దోపిడీకి గురి చేస్తున్నాయని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ అన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ 9వ మహాసభ విద్యానగర్ మార్క్స్ భవన్‌లో శుక్రవారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌లను పెద్ద ఎత్తున వ్యతిరేకించి వాటికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నా అమలు చేయడం సరికాదని విమర్శించారు.

విముక్త చిరుతల కచ్చి తెలంగాణ అధ్యక్షుడిగా డా. శ్రీనివాస్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విముక్త చిరుతల కచ్చి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జిలుకర శ్రీనివాస్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు తోల్ తిరుమావలవన్ ఎంపిక చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విముక్త చిరుతల కచ్చి తెలంగాణ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా ఏ.ఎం.షోహెబ్, రాష్ట్ర కార్యదర్శులుగా వెంకట్‌యాదవ్, సాహు మహరాజ్, బొట్టు శ్రీధర్, సంజీవ, అబ్దుల్ హరి, అక్బర్ హుస్సేన్, ఎస్.కే.నబీ, రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా రవి, డిప్యూటీ కోశాధికారిగా ఇర్ఫాన్ ముజాహుద్దీన్, అధికార ప్రతినిధులుగా శ్యామ్, ఉస్మాన్ ఖాన్, కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, శ్రీనివాస్, శంకర్, వెంకటేష్, నదీమ్, ఖలీద్, సలీమ్, అక్బర్‌లను ఎంపిక చేశారు.

ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన తెలంగాణ అమరవీరుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉద్యమకారుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సోమన్న మాట్లాడుతూ.. పునాదులను మరిచిన పాలకవర్గ పునాదులు కదిలించాలని ఆయన పిలుపునిచ్చారు. తుమ్మల ప్రఫుల్ రామ్‌రెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు తుల్జారెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ మధు, వైస్ ప్రెసిడెంట్ వేణు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సూర్యకిరణ్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ముషీరాబాద్: కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని డాక్టర్ ప్రీతిపై ర్యాగింగ్ చేసి మానసికంగా వేధించిన సీనియర్ విద్యార్థిపై ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డీపీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కన్నా డిమాండ్ చేశారు. సీనియర్ విద్యార్థి చిత్రహింసలకు పాల్పడుతుంటే అది భరించలేకే ఆమె తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ప్రస్తుతం ఆమె నిమ్స్‌లో చికిత్స పొందుతుందని ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్న ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా కౌన్సిలింగ్‌తో సరిపెట్టడంతో తిరిగి వారు అదే పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వరుసగా ర్యాగింగ్ ఘటనలు పెరిగిపోతున్నాయని ర్యాగింగ్ భూతాన్ని ఎదుర్కొనేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆక్రమణలతో పాదచారులకు దారేది..?

- మార్జిన్ స్థలాలను వదలని వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

నల్లకుంట: జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల అలసత్వం, అవినీతి కారణంగా పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు, మార్జిన్ లోపలి స్థలాలు వ్యాపారుల ఆక్రమణకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు యథేచ్ఛగా తమ వాహనాలు, వ్యాపార బోర్డులను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇరుకైన రోడ్లు, దీనికి తోడు రోడ్డు పక్కన ఉండే మార్జిన్‌లైన్‌లోని స్థలాలను సైతం వదలడం లేదని ప్రజలు చెబుతున్నారు.

- నల్లకుంట శంకరమఠం రోడ్డు, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.
- కొందరు ద్విచక్ర వాహనాలను పార్క్ చేయడంతో పాటు, తమ దుకాణాలకు సంబంధించిన సైన్ బోర్డులు, దుకాణంలోని వస్తువులను ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాదచారులకు నడిచేందుకు వీలులేక విధిలేని పరిస్థితిలో రోడ్డుపైనే నడుస్తూ ప్రమాదాల బారి పడుతున్నారని పలువురు వాపోతున్నారు.
- పక్కనే చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉంటున్నా ఫుట్‌పాత్ ఆక్రమణదారులను మందలించకుండా వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.
- ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగింపచేసే ట్రాఫిక్, జీహెచ్ఎంసీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆ తరువాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఫీవర్ ఆస్పత్రి సిగ్నల్స్ సమీపంలో ఫుట్‌పాత్ ఇలా..

ఆక్రమణలపై చర్యలు..

చిక్కడపల్లి: త్యాగరాయగానసభ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలను చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. శుక్రవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ దరావత్ నానునాయక్ మాట్లాడుతూ.. ఎన్నో రోజులుగా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయనే ఫిర్యాదులు రావడంతో వాటిని తొలగించామని వివరించారు.



పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ముషీరాబాద్: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులను హెచ్చరించారు. ఫిర్యాదులకు అవకాశం లేకుండా బస్తీలు, కాలనీల్లో పారిశుద్ధ్య సేవలు కొనసాగించాలని, అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. శుక్రవారం ఆయన సర్కిల్-15 ఎఎంహెచ్‌ఓ మైత్రేయితో కలిసి పారిశుద్ధ్య విభాగం ఎస్ఎస్‌లు, ఎస్ఎఫ్ఎలు, శానిటరీ జవాన్‌లతో జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య సేవల తీరు, రోడ్ల పరిశుభ్రత, వ్యర్థాల తొలగింపుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య సేవలను మరింత మెరుగుపరచాలని దీని కోసం రోజూ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ పటిష్టంగా చేపట్టాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిన్ పాయింట్ ప్రోగ్రామ్ పటిష్టంగా అమలు జరగాలని, శానిటరీ జవాన్‌లు, ఎస్ఎఫ్ఏలు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య

చిక్కడపల్లి: రోడ్లు, కాలనీ బస్తీల్లో చెత్త, చెదారాలు పేరుకుపోకుండా పరిశుభ్రతపై తగిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్లో శానిటరీ జవాన్స్‌తో, ఎస్ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు, పరిసరాల్లో చెత్తచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఎంటమాలజీ మైత్రేయి, జవాన్లు, ఎస్ఎఫ్ఏలు సిబ్బంది తదితరులున్నారు.

ప్రగతిశీల శక్తులతో ప్రపంచ శాంతి, అభివృద్ధి సాధ్యం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వామపక్ష, ప్రగతిశీల శక్తులతోనే ప్రపంచ శాంతి, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిశ్వాస్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విప్లవాత్మక పోరాటాలతో సామ్రాజ్యవాద దురాక్రమణలను అడ్డుకునే వామపక్ష పార్టీలతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

- ప్రపంచంలో మానవ, రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామ్య హక్కులు సామ్రాజ్యవాదులచే రాయబడుతున్నాయన్నారు.
- ప్రజలకు ఉపాధి, ఉచిత ఆరోగ్య సంరక్షణ, విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి కోసం ప్రగతిశీల శక్తులు ఏకమై బలమైన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.
- భారత దేశంలో ఒక ముఖ్యమైన రాజకీయ శక్తిగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
- ఈ మహాసభలు ఫార్వర్డ్ బ్లాక్ కొత్త అభివృద్ధికి నాంది పలుకుతుందని నమ్ముతున్నామన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో శాంతి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సామాజిక పురోగతి కోసం ఫార్వర్డ్ బ్లాక్ నిరంతరం పని చేస్తోందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ప్రతినిధులు కతిరావన్, శివశంకర్, గోవిందరాయ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు జోజిరెడ్డి, సుందరరామరాజు, తేజదీప్ రెడ్డి, రాములుయాదవ్, వంశీధర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు

ముషీరాబాద్: గాయత్రీ పోచమ్మ, ముత్యాలమ్మ దేవస్థానంలో ధ్వజస్తంభం, కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గం, రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌కే నగర్‌లోని దేవాలయంలో ఆలయ నిర్వాహకులు ఏ.ఆర్.యాదగిరి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అతినగరం సురేష్, మురళీచారి తదితరులున్నారు.

చైన్ స్నాచర్‌కు 8 నెలల కారాగార శిక్ష

అంబర్‌పేట: రైల్వేస్టేషన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడికి రైల్వే మెజిస్ట్రేట్ కోర్టు 8 నెలల కఠిన కారాగార శిక్ష విధించింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన గౌస్‌పాషా కుమారుడు అల్మాస్‌ఖాన్ (27) వృత్తి రీత్యా ప్రైవేటు ఉద్యోగి కాగా.. 2022 జూన్ నెలలో ఎలహంక రైలుకు వెళ్లేందుకు ఓ ప్రయాణికురాలు స్టేషన్‌కు వచ్చింది. ఆమె రైలు ఎక్కుతుండగా ఆమె బ్యాగ్‌లో ఉన్న 6.50 తులాల బంగారాన్ని అల్మాస్‌ఖాన్ తీసుకుని పారిపోయాడు. అప్రమత్తమైన బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం నిందితుడిని రైల్వే కోర్టులో హాజరుపరచగా బోయిగూడ రైల్వే 2ఎంఎం కోర్టు 8 నెలల జైలు శిక్ష విధించినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆశీర్వాదం



నూతన వధూవరులతో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నల్లకుంట: నల్లకుంట బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ కుమార్తె నీలిమ వివాహం ఈ నెల 9న జరగగా.. ఆ సమయంలో నగరంలో లేని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం సాయంత్రం వారి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. స్థానిక కార్పొరేటర్, బీజేపీ నాయకులు శ్యామ్‌రాజ్, ఎస్.రాంజగదీశ్‌ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ముషీరాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి వెల్లడించారు. రాంనగర్ దయారా మార్కెట్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం జలమండలి డీజీఎం మోహన్‌రావుతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.



అలరించిన చిన్నారుల భక్తి గీతాలు



నల్లకుంట: శ్రీరామగాన సభ ఆధ్వర్యంలో నిర్వహించనున్న త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధన సంగీతోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం న్యూ నల్లకుంటలోని రామాలయం ప్రాంగణంలో నాదోపాసన బృందం బాలబాలికలచే ప్రత్యేక భక్తి సంగీత కచేరీని ఏర్పాటు చేశారు. ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు పద్యాలు, భక్తి గీతాలు ఆలపించి ఆహుతులను ఆకట్టుకున్నారు.

ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక చొరవ

అంబర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధికి రాజీలేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట తురాబ్‌నగర్‌లో తన సొంత ఖర్చులతో ప్రజా అవసరాల కోసం బోరు వేయించినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చే వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టామన్నారు.



తురాబ్‌నగర్‌లో బోరు వేయిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మద్యం మత్తులో హంగామా చేసిన వ్యక్తికి జైలు

ముషీరాబాద్: మద్యం మత్తులో హంగామా సృష్టించి పోలీస్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి 10 రోజుల జైలుశిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న సాయంత్రం సహారా ఫంక్షన్‌హాల్ వద్ద ముషీరాబాద్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపతుండగా.. భోలక్‌పూర్‌కు చెందిన సయ్యద్ జునాయిద్ బియాబానీ (24) మద్యం సేవించి పోలీసులకు పట్టుబడి వారితో దురుసుగా ప్రవర్తించి బూతులు తిడుతూ వీరంగం సృష్టించాడు. ఈ మేరకు ముషీరాబాద్ పోలీసులు అతడిపై పెట్టి కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ నిందితుడికి 10 రోజుల జైలుశిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెలువరించారు.

సంత్ గాడ్గేబాబా జయంతిని అధికారికంగా నిర్వహించాలి



నివాళులర్పిస్తున్న గాడ్గేబాబా దళిత సేవా సమితి అధ్యక్షుడు స్వామి అల్వాల్ తదితరులు

నల్లకుంట: కుల నిర్మూలన, అంటరానితనం నిర్మూలన కోసం నిరంతరం కృషి చేస్తూనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విద్యా సంస్థలు స్థాపించిన గొప్ప సంఘ సంస్కర్త సంత్ గాడ్గేబాబా అని గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్ అన్నారు. ఆయన జయంతిని అధికారికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలన్నారు. శుక్రవారం నల్లకుంట సంజీవయ్యనగర్‌లో గల అంబేడ్కర్ శతాబ్ది భవన్‌లో సంత్ గాడ్గేబాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్గేబాబా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి అల్వాల్ అక్కడి అంగన్‌వాడి పాఠశాల చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. శతాబ్ది భవన్ ఇన్‌చార్జ్ నిర్మల, ఎమ్మార్పీఎస్ అంబర్‌పేట్ ఇన్‌చార్జ్ బాలకృష్ణ, ఏఐఎస్సీఆర్ఎస్ కార్యదర్శి ప్రభుదాస్, శివసేన ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర నాయకుడు గణేష్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరావు కుమార్, యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి బేగంపేట నరసింహ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేష్, సహ కార్యదర్శి బాలకృష్ణ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యానికి ప్రత్యేక స్థానం



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

నల్లకుంట: భారతీయ కళలలో కూచిపూడి నాట్యానికి ప్రత్యేక స్థానం ఉందని డాక్టర్ గౌడ్స్ డెంటల్ ఆసుపత్రి సీఎండీ విజయలక్ష్మిగౌడ్ అన్నారు. శృంగేరి శంకరమఠం, ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నల్లకుంటలోని శంకరమఠం ప్రాంగణంలో విశిష్ట నృత్య కళాభారతి అకాడమీ చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కవయిత్రి సామాజిక వేత్త డాక్టర్ లక్కరాజు నిర్మలతో కలిసి ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకటయ్య (ఫైల్)

నల్లకుంట: ఇంట్లో చెప్పకుండా ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కడప జమ్మలమడుగుకు చెందిన వెంకటయ్య (74) నల్లకుంట ఓయూ రోడ్డులోని మనోహర్ అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 20న సాయంత్రం 5-6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను సంప్రదించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆయన కుమార్తె రాధ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

కవాడిగూడ: దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ఖేలో సికింద్రాబాద్, జీతో సికింద్రాబాద్ క్రీడా పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, యువమోర్చా నగర అధ్యక్షులు మద్దూరి శివాజీ, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, దిశ కమిటీ మాజీ సభ్యులు వెంకటేష్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు వినయ్‌కుమార్‌లు హాజరై 100, 200, 800 మీటర్ల అథ్లెటిక్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ నేతలు పరిమళ్‌కుమార్, సలంద్రి దిలీప్‌యాదవ్, అనిల్, శక్తిసింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.



పాల్వంచకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

కవాడిగూడ: స్థానిక సంస్థలకు 21 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి పాలక మండలిని ఏర్పాటు చేయాలని పాల్వంచ ఎన్నికల పునర్నిర్వహణ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ యువతరం పార్టీ, క్లీనర్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో గిరిజన సేవక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ, జై భీమ్ సంస్థ ప్రతినిధులు నరేష్, సురేష్‌నాయక్, పవన్ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుని వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు.



ఇందిరాపార్కు వద్ద నిరసన చేపడుతున్న దృశ్యం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అంబర్‌పేట: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకారం.. గురువారం రాత్రి 11 సమయంలో అలీకేఫ్ చౌరస్తాలోని ఓ మెడికల్ దుకాణం సమీపంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారకంగా స్థితిలో ఉన్న అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు సుమారు 35 ఏళ్ల ఉంటాడని, నలుపు రంగు కోటు ధరించి ఉన్నట్లు పోలీసుఉల తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



కాచిగూడలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కవాడిగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని పలువురు బీజేపీ నేతలు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వాడవాడలా తెలియజేసేందుకు ప్రజాగోసా బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లు దోహదపడతాయన్నారు. శుక్రవారం కవాడిగూడ దేవిప్రసాద్‌బాగ్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ ఎ.ప్రభాకర్ గంగపుత్ర ఆధ్వర్యంలో ప్రజాగోసా, బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, యువమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు భరత్‌గౌడ్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్‌బాబు, దిశ కమిటీ మాజీ సభ్యులు వెంకటేష్‌లు హాజరయ్యారు.

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని ఆ పార్టీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాచిగూడ డివిజన్‌లోని కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై కార్నర్ మీటింగ్‌లతో ప్రజలకు దగ్గరయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పట్ల తాను మమేకమై అండగా ఉంటామన్నారు. బీజేపీ నాయకులు రమేష్‌యాదవ్, సంతోష్ పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్‌ను నిర్మించాం..

చిక్కడపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అరుంధతినగర్ బస్తీవాసులకు హుస్సేన్‌సాగర్ రిటైనింగ్‌వాల్ నిర్మింపజేశామని స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అరుంధతినగర్‌లో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అరుంధతినగర్ బస్తీలో నాలా నిర్మాణంలో కొంత భాగం కోతకు గురైందన్నారు. బాధితుడికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, నష్టపరిహారం ఇప్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. బస్తీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఉమేష్, ఎ.వినయ్, రమేష్‌రామ్, సాయిచంద్, లక్ష్మీపద్మజ, యాదగిరిగౌడ్, శ్రీకాంత్, చిన్నా, పీఎస్‌రావు, నవీన్, సురేష్, సూరి, జీడీ రాజు, కుమార్, లక్ష్మణ్‌యాదవ్, రాజు, బాలస్వామి, సాయితరుణ్, సత్తిరెడ్డి, మహమూద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

పేదల అభ్యున్నతికి కేంద్ర పథకాలు..

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని బీజేపీ సీనియర్ నాయకులు శేషసాయి అన్నారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా గోసా బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఉచితంగా ప్రతీ భారతీయుడికి కరోనా వ్యాక్సిన్ ఇచ్చి దేశాన్ని కాపాడారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డివిజన్ అధ్యక్షుడు నరేష్, నాగరాజు, గౌరీశంకర్, నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌రావు, జగదీష్, విశ్వనాథశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలుడిపై దాడి.. నిందితుడి రిమాండ్

చిక్కడపల్లి: అకారణంగా మైనర్ బాలుడిపై చేయిచేసుకున్న ఘటనలో ఓ వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి పీపుల్స్ పార్క్ వద్ద నివాసం ఉండే పదోతరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలుడు తన స్నేహితురాలితో కలిసి ట్యూషన్‌క్లాస్ నుంచి గురువారం రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే ఉండే నూకల శ్యామ్‌సాయి నారాయణ(25) ఆ బాలుడిని నీవెవరు ఆ అమ్మాయి ఎవరంటూ నిలదీయడంతో పాటు బాలుడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలుడి పన్ను ఊడిపోగా.. ఇంటికి వెళ్లి తండ్రికి విషయం చెప్పాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లిన తండ్రి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై కిరణ్‌కుమార్ దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

కళాశాల స్నాతకోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సెయింట్ జాన్స్ పీజీ కళాశాల స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బిషప్ రైట్. రెవరెండ్ డాక్టర్ జాన్ గొల్లపల్లి అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 2020-2022 బ్యాచ్ పీజీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.